క్లుప్తంగా

టీం ల్యాబ్ ఏర్పాటు



ల్యాబ్ ప్రారంభించిన ఏసీఎంవో ఉద్దవ్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో సీవైడీఏ ఆధ్వర్యంలో టీం ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు ఏసీఎంవో ఉద్దవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జంగు, సీవైడీఏ సంస్థ అధికారులు నరేశ్, బాలకృష్ణ, రవీందర్ పాల్గొన్నారు.

చేతిపంపునకు మరమ్మతు



మరమ్మతు చేయిస్తున్న సభ్యులు

బెజ్జూర్: మండల కేంద్రంలోని తెనుగువాడలో గత కొంత కాలంగా తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ దృష్టికి కాలనీవాసులతో పాటు విఠల్ సైన్యం సభ్యులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన సమస్య పరిష్కరించాలని యువసేన సభ్యులను ఆదేశించారు. దీంతో యువ నాయకులు సామల రాజన్న, రంగు సురేశ్‌గౌడ్ గ్రామపంచాయతీ కార్యదర్శి తుకారాంతో కలిసి శుక్రవారం చేతిపంపునకు మరమ్మతులు చేయించారు.

'అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు'



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రెబ్బెన: తుంగెడ గ్రామంలో అర్హులైన నిరుపేదలను పక్కన పెట్టిన అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం పీడీ వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుండగా తుంగెడలో చేపట్టిన లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సాయిక్రిష్ణ, జుమ్మిడి అనిత, విజయలక్ష్మి, స్వప్న సరిత, అనిత, తులసి, లలిత, సునీత, సుమలత పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

లింగాపూర్: మండలంలోని మామిడిపల్లి పరిధిలోని నడ్డంగుడా గ్రామంలో శుక్రవారం సేవాలాల్ మహరాజ్, జగదంబా దేవి ఆలయాన్ని లింబాజీ మహరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లింబాజీ మహరాజ్ మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బంజారా వేషధారణ, సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోవద్దన్నారు. ఇందులో భాగంగా గ్రామస్తులు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కోవా లక్ష్మిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

వాంకిడి: కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ అన్నారు. మండలంలోని లంజన్వీర, మండోకర్‌వాడ గ్రామాల్లో శుక్రవారం ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా స్థానిక కాంగ్రెస్ నాయకుల దృష్టి తీసుకురావాలని సూచించారు. వాంకిడి మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, నాయకులు గణేష్, దాదాజీ, అనిల్, మల్లయ్య, సురేందర్, జైరాం, పెంటు పాల్గొన్నారు.

అడవి నరికిన వ్యక్తులకు రిమాండ్

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్: అడవి నరికివేత నేరమని జోడేఘాట్ అటవీ క్షేత్రాధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వాడిగొంది గ్రామానికి చెందిన టేకం రాజు, సీడం మారు అక్రమంగా అడవి నరకడంతో వారిపై కేసులు నమోదు చేసి 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా అడవిని నరకడం, కలపను తరలిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మోవాడ్ సెక్షన్ ఆఫీసర్ సంతోష్, బీట్ అధికారి అమరేందర్, శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

పశువుల దాహం తీర్చేదెలా?



పశువుల దాహార్తి తీర్చేందుకు ఉపాధి హామీ పథకంలో భాగంగా నీటితొట్టిలు నిర్మించారు. అవి నాణ్యతగా చేపట్టకపోవడంతో ధ్వంసమయ్యాయి. ఉన్న చోట నీరు నింపక నిరుపయోగంగా మారాయి. దీంతో వేలాది రూపాయాలు వృథాగా మారాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పశుపోషకులు కోరుతున్నారు.

– దహెగాం

తవ్వారు.. వదిలేశారు

కౌటాల మండల కేంద్రంలోని రహదారులు నిత్యం రద్దీగా ఉంటాయి. అయితే నిత్యం ఏదో ఒక పనులు చేస్తూ.. రోడ్డుకు ఇరువైపులా గుంతలు తవ్వుతున్నారు. తవ్విన గుంతలను అలాగే వదిలేస్తున్నారు. కుమురం భీం, జగ్జీవన్ రామ్ చౌరస్తాలో గుంతలు తవ్వి వదిలేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు

– కౌటాల



పేదలకు అందని ఇందిరమ్మ ఇళ్లు

- ఇందిరమ్మ కమిటీ సభ్యులపై ఆరోపణలు
- గ్రామాల్లో ప్రజల నిరసన

చింతలమానెపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ఆదిలోనే అభాసుపాలవుతోంది. పేదవాడికి ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకం దళారుల చేతిలోకి వెళ్లింది. దీంతో గ్రామాల్లో ప్రజలు నిరసన తెలుపుతున్నారు. ఇందిరమ్మ కమిటీలపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. చింతలమానెపల్లి మండలంలోని బాబాపూర్ గ్రామాన్ని ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పైలట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపిక చేశారు. గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను ఎంపిక చేసి 154 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరిలో కొంతమంది ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాలలో సైతం అర్హులను ఎంపిక చేసి లబ్ధిదారుల జాబితా రూపొందించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు ఎంపిక చేసిన వారికి మండల అధికారులు తీర్మానాలు రూపొందించే పనిలో ఉన్నారు.

ఆదిలోనే అక్రమాలు..

మండలంలోని బాబాపూర్ గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేసి పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. గ్రామ పంచాయతీ ఇందిరమ్మ కమిటీలో సభ్యుడిగా ఉన్న ఒక కుటుంబానికి రెండు అంతస్తుల భవనం ఉంది. అయినా అతని ఉన్న ఇద్దరు కుమారులకు ఇంటి కోడలి పేర్ల మీద రెండు ఇండ్లు మంజూరయ్యాయి. మొదటి విడతలోనే ఒక కుమారుడి ఇంటికి పనులు ప్రారంభించారు. మొదటి విడతలో బాబాపూర్ గ్రామంలో 15 ఇండ్లకు భూమిపూజ నిర్వహించగా వీటిలో ఒకరు మాత్రమే గిరిజనుడు కాగా ఇతను గ్రామ కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మిగతా 14 మంది బీసీలు. నందికొండలో ఇళ్లు మంజూరైనా భూమిపూజ చేయలేదు. గ్రామానికి చెందిన కోర్తె శంకర్ ఇల్లు కూలిపోగా ఇంటికి ప్లాస్టిక్ కవర్లు కప్పి ఉంచాడు. ఇదే ఇంటిలో తన కుమారుడి కుటుంబంతో నివాసం ఉంటున్నా ఇల్లు మాత్రం మంజూరు కాలేదు. బాబాపూర్‌తో పాటు దిందా, డబ్బా, ఖర్జెల్లి, లంబాడిహేటి గ్రామాల్లో గ్రామస్తులు నిరసన తెలుపుతున్నారు.



నిరసన తెలుపుతున్న దిందా గ్రామస్తులు

ఇందిరమ్మ కమిటీలపై..

రాజకీయ నాయకులకు అనుబంధంగా పనిచేసే వారిని, రాజకీయ నాయకులను ఇందిరమ్మ కమిటీ సభ్యులుగా ఎంపిక చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పక్కా ఇండ్లు ఉన్నవారికి సైతం ఇండ్లు మంజూరు చేశారని గ్రామస్తులు మండిపడుతున్నారు. బాబాపూర్ గ్రామంలో జాబితా రూపొందడం కంటే ముందే పలువురు ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఆయా గ్రామాల కార్యదర్శులు పలువురికి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ కమిటీ సభ్యుల అక్రమాలకు పాల్పడుతుండడంతో నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. దిందా గ్రామంలో ఇండ్లు రానివారు ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పంచాయితీ కార్యదర్శి, మాజీ ఉపసర్పంచ్‌లు అక్రమాలకు పాల్పడుతున్నట్లు దిందా గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులకు ఇళ్ల మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

రెబ్బెన: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని దీక్ష గురు శ్రీశ్రీ ప్రేమ్‌సింగ్ మహరాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కైరిగూడ జగదాంబ, సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్, గురు రామారావు మహరాజ్ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడా ప్రజలు ఐక్యంగా ఉండి తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమాల్లో గ్రామస్తులు ఆజ్మీర ఆత్మారాం నాయక్, మాజీ సర్పంచ్ సంధ్యారాణి, దుప్పా నాయక్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ప్రేమ్‌సింగ్ మహరాజ్

ఆర్వో వాటర్ ఫిల్టర్ ప్రారంభం



తాగునీటిని అందిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ఫిల్టర్ ఫ్రిడ్జ్‌ను శుక్రవారం ఏఎస్పీ చిత్తరంజన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి ప్రతిరోజూ వైద్యసేవల కోసం వచ్చే రోగులు, వైద్య సిబ్బంది కోసం ఆర్వో వాటర్ ఫిల్టర్, ఫ్రిడ్జ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవిలో ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సీఐ రవీందర్, ఎస్సైలు అంజన్న, ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరం

వాంకిడి: గత సంవత్సరం గుర్తించిన మలేరియా జ్వర పీడిత గ్రామాల్లో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సోనాపూర్, చిచ్చుపల్లిలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, రక్త నమూనాలు సేకరించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అనవసరంగా బయటికి వెళ్లొద్దని సూచించారు. ఉదయం 10 గంటల లోపు సాయంత్రం 5 గంటల తర్వాత పనులు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, పీహెచ్ఎన్ క్రిష్టియాన, హెల్త్ అసిస్టెంట్ భగవాన్‌దాస్, గోదావరి, సుంద, ఆశలు కిష్టుబాయి, కమల, సునీత, మాస్కుబాయి పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

విచారణ చేపట్టాలని ఫిర్యాదు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలో వాటర్‌షెడ్ పథకంలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ వాటర్‌షెడ్ యాజమాన్య కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ ఆధారిత, వ్యవసాయేతర రుణాలు అందిస్తున్నారని, ఎంపిక చేసే ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలకు రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేసే కొంతమంది సీసీలు చేతివాటం ప్రదర్శించారని ఆరోపించారు. అమాయక గిరిజన, దళిత మహిళల యూనిట్లలో సగం కాజేశారన్నారు. మరి కొన్నిచోట్ల యూనిట్లను గ్రౌండింగ్ చేయకుండానే డబ్బులు పక్కదారి పట్టించారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

తిర్యాణి: మండలంలోని ఎర్రబండ, గీసిగూడ, తాటిగూడ గ్రామాల్లో ఆదివాసీలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ సూర్యప్రకాశ్‌ను కలిసి భూ సమస్యలను వివరించారు. ఎన్నో సంవత్సరాలుగా సాగు చేస్తున్నా.. రెవెన్యూ భూమి అటవీశాఖ అధికారులు తమదే అనడం సరికాదన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, మాజీ సర్పంచ్ కోట్నాక గణపతి పాల్గొన్నారు.

నేడు గ్రంథాలయం ప్రారంభం

తిర్యాణి: పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా పాత పోలీస్‌స్టేషన్ భవనంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రారంభోత్సవానికి జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగులు, పాఠకులు హాజరు కావాలని కోరారు.

పోలీసుల చొరవతో ఫోన్ లభ్యం

కెరమెరి: పోలీసుల చొరవతో మొబైల్ లభ్యమైంది. కెరమెరి ఎస్సై ఎస్.మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కెలికే గ్రామానికి చెందిన భరత్ అనే యువకుడు కెరమెరి యార్కెట్లో ఫోన్ పొగొట్టుకున్నాడు. మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఫోన్‌ను ట్రేస్ చేస్తే శుక్రవారం భరత్‌కు అప్పగించారు. ఎవరైనా ఫోన్‌ను దొంగలించిన, పోగొట్టుకున్న అధైర్యపడవద్దని, పోలీస్‌స్టేషన్ వచ్చి ఫిర్యాదు చేయాలని ఎస్సై మధుకర్ సూచించారు.



ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై మధూకర్

నేర రహిత సమాజానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న సీఐ బుద్దె స్వామి

రెబ్బెన: నేర రహిత సమాజానికి ప్రజలు కృషి చేయాలని రెబ్బెన సీఐ బుద్దె స్వామి అన్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని గోలేటి విలేజ్‌లో కార్డన్‌సెర్చ్, కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది గ్రామాల్లోని ప్రతీ ఇంట్లో సోదాలు నిర్వహించారు. గ్రామంలో 50 వాహనాలను పరిశీలించగా.. వాటిలో 3 వాహనాలకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. గుట్టుగా గుడంబా తయారీ, కొనుగోలు చేస్తున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. బెల్లం పానకంను ధ్వంసం చేశారు. ప్రజలకు భద్రత, శాంతిభద్రత పరిస్థితుల మెరుగుదల కోసం కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తునట్లు తెలిపారు. పోలీసులు ప్రజా సంక్షేమం కోసం నిబద్ధతతో పని చేస్తారని అన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడుతాం



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

బెజ్జూర్: రాజీవ్ యువవికాస్ పథకంలో అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువవికాస్ పథకం దరఖాస్తులను పరిశీలించారు. మండలంలోని పాపన్నపేట, సోమిని, సుస్మీర్, కృష్ణపెల్లి, ముగవెల్లి గ్రామపంచాయతీల్లో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బెజ్జూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సత్యకిరణ్, ఏపీఎం మోహన్‌లాల్, సీనియర్ అసిస్టెంట్ సోహెల్ అహ్మద్, జూనియర్ అసిస్టెంట్లు వసంత్ పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన ప్రారంభం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన శుక్రవారం ప్రారంభమైంది. ధనోరా, గోయగాం, కొఠారి, పార్డ, రింగన్‌ఘాట్, ఖైరీ, ఆగర్‌వాడ గ్రామ పంచాయతీలకు చెందిన ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాల లబ్ధిదారుల దరఖాస్తులను కమిటీ సభ్యులు పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి వెంకటి, ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, టీజీబీ బ్యాంకు మేనేజర్ శ్రీపాద్ పాల్గొన్నారు.

రెబ్బెన: రాజీవ్ యువవికాసం పథకంలో భాగంగా రుణాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మొదలైంది. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రెబ్బెన, ఇందిరానగర్ గ్రామ పంచాయతీల పరిధిలోని బీసీ, మైనార్టీ, ఈబీసీ కార్పొరేషన్‌ల ద్వారా రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను డీపీవో భిక్షపతి, బ్యాంకు అధికారులతో కలిసి పరిశీలించారు. పరిశీలన పూర్తయ్యాక అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరమ్మ, ఎంపీవో వాసుదేవ్, ఏపీవో వెంకటరమణ శర్మ, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితా ప్రదర్శన

కౌటాల: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారుల జాబితాను గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించినట్లు ఎంపీవో మహేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కౌటాల గ్రామ పంచాయతీలో జాబితా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులైన వారిని గుర్తించి తుది జాబితాను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపికపై ఏమైనా సందేహాలుంటే పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలన్నారు.

కెరమెరి: మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను పంచాయతీ సిబ్బంది ప్రదర్శించారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జాబితాను అతికించారు.



జాబితా ప్రదర్శిస్తున్న పంచాయతీ సిబ్బంది

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. శుక్రవారం కౌటాల జెడ్పీ పాఠశాలలో యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని పరిశీలించారు. క్రీడలతో మానసికోల్లాసం, స్నేహభావం పెరుగుతుందన్నారు. యోగా, కరాటే, నృత్యం, డ్రాయింగ్, పేయింటింగ్స్, ఇండోర్ గేమ్స్ ఆడిస్తామన్నారు. సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



సమ్మర్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899